క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని శ్రీకోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ చేశారు. 14 రోజుల పాటు బ్రహ్మోత్సవాల నిర్వహణకు గ్రామస్తులు, ఉభయదారులు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 14న పుష్ప రథంపై స్వామివారి విహారంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

బూత్ కన్వీనర్‌గా వెంకటేష్

గుడుపల్లి: వైఎస్సార్‌సీపీ మండల బూత్ కన్వీనర్‌గా గుడికొత్తూరు గ్రామానికి చెందిన వెంకటేషను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ నుంచి మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని వెంకటేష్ తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌కు ఫ్యాన్లు వితరణ

పలమనేరు: పట్టణంలోని ఎస్సీ హాస్టల్-1లో పిల్లల సౌకర్యార్థం దాతలు సీతారామయ్య, వాసవి మహిళా సంఘం, నరేంద్రబాబు నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. దాతలకు హాస్టల్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

పులిచెర్ల(కల్లూరు): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. మంగళవారం రాయవారిపల్లె సచివాలయ పరిధిలోని పుచ్చలవారిపల్లె, తానికొండవారిపల్లె, మేడికొండవారిపల్లెల్లోని లేఅవుట్‌లను ఆమె తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ త్యాగరాజ, వర్క్ఇన్‌స్పెక్టర్ చెంగల్‌రాయులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ కన్వీనర్‌గా దేవరాజులు



పలమనేరు: పెద్దపంజాణి మండలం రాయలపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మర్రిమేకల దేవరాజులు ఏపీ ఉపాధ్యాయ సంఘం పలమనేరు నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు మంజునాథ గుప్త నియామక పత్రాన్ని అందించారు. సంఘం నాయకులు దొరస్వామి, పట్టాభి, హేమాద్రి, చిరంజీవి పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

సదుం: స్థానిక ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో https://mjpbcwreis.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈబీసీ, బీసీలకు 11 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీలు 13 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఓఎంఆర్ పద్ధతిలో 50 మార్కులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు9059494307, 9059494307 నంబర్లను సంప్రదించాలన్నారు.

పెన్షనర్ల సమస్యలపై వినతి

పలమనేరు: సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల సమస్యలను ఖజానాశాఖ సంచాలకులు మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక పెన్షనర్ల సంఘం నేత గురురాజారావు మంగళవారం తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ పింఛన్ అందించాలని, లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే గడవును పెంచాలని, ఈకేవైసీ బాధ్యతను సంబంధిత ఎస్టీఓలు తీసుకోవాలని విన్నవించినట్లు చెప్పారు.

గడ్డివాము దగ్ధం

సోమల: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ కొత్తపల్లెలో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు మునిలక్ష్మి తెలిపింది. ఇందుకు గ్రామానికి చెందిన వెంకటరమణ కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన ర్యాలీ

గుడుపల్లి: శెట్టిపల్లె, గోకర్లపల్లె యూనిట్‌లోని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అధికారులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ మునిక్రిష్ణ, ప్రకృతి వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ శ్రీదేవి, శంకర్‌రెడ్డి, రూప, కృష్ణప్ప పాల్గొన్నారు.

జీలుకు స్టార్ మోటార్ సేవియర్ అవార్డు

పలమనేరు: సౌత్‌ఇండియన్ మోటార్ ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్ రోడ్డు భద్రతపై రెండ్రోజుల క్రితం బెంగళూరులో సమావేశం నిర్వహించింది. ఇందులో పలమనేరుకు చెందిన లారీ డ్రైవర్ల సంఘం నేత జీలుకు స్టార్ మోటార్ సేవియర్ అవార్డుతో సత్కరించింది.

3న మండల సమావేశం

పుంగనూరు : ఈనెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాధారణ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు
- ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రదానం



పలమనేరు: ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లీలారాణి



పెద్దపంజాణి: నారిరెడ్డిపల్లి పాఠశాలలో సీవీ రామన్‌కు అక్షర నివాళి

పలమనేరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలమనేరు మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం విజ్ఞాన ప్రదర్శనలు జరిగాయి. క్లస్టర్ పాఠశాలలైన దొడ్డిపల్లి, ఉర్దూ, పెంగరగుంట పాఠశాలలో జరిగిన సైన్స్ మేళాను ఎంఈఓ లీలారాణి పరిశీలించారు. సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ మేళా ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

అలరించిన ప్రయోగాలు

హృదయం, జీర్ణవ్యవస్థ, వాతావరణం, నీటి ఆవిరితో నడిచే జేసీబీ, ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నల్ సిస్టం, హోమ్ థియేటర్, గాలితో, నీటితో పనిచేసే వాక్యూమ్ క్లీనర్‌ల ప్రయోగాలు అబ్బురపరిచాయి. హెచ్‌ఎంలు నేతాజి, బాలసుందరం, శ్రీనివాసులు, అనురాధ, శ్రీహరి, మునాఫ్ పాల్గొన్నారు.

– స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్‌క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళాను ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పరిశీలించారు. ఎంఈఓ సాయిలీల, హెచ్‌ఎం విశ్వనాథ్ పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు సుమారు 130 సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు.

కుప్పంరూరల్: ఆధునిక యుగం మొత్తం సైన్స్‌పై ఆధారపడిందని, అలాంటి సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులకు సైన్స్ నమూనాలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు.

కుప్పం: స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఎంఈఓ మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు సందర్శించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

గుడుపల్లి: తలి అగ్రహారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వి.కోట: సైన్స్ ఆవిష్కరణలతో దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ యువరాజు అన్నారు. మండలంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.

పెద్దపంజాణి: విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ హేమలత అన్నారు. నిడిగుంట సీఆర్సీ పరిధిలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీవీరామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పుంగనూరు : భారతరత్న డాక్టర్ సీవీరామన్ ను ఆదర్శంగా తీసుకుని సైన్సు రంగంలో విద్యార్థులు రాణించాలని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం అకాడమిలో, భాష్యం పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. భాష్యం పాఠశాల ఇన్‌చార్జ్ లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు వివిధ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఎంఈవో సిద్ధరామయ్య, ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ ఎగ్జిబిట్‌లకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంతాతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి.

రొంపిచెర్ల: పెద్దమల్లెల, రొంపిచెర్ల బాలుర, బాలికల సీఆర్‌సీ కేంద్రాల్లో సైన్సు డే నిర్వహించారు. స్థానిక బాలికల హైస్కూల్‌లో నమూనా ప్రదర్శనలను ఎంఈవో హసన్‌సాహెబ్ తిలకించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



కల్లూరులో బహుమతుల అందజేత



సోమల : నంజంపేట హైస్కూల్‌లో..



సదుం: నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

సోమల : నంజంపేట హైస్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ తిలకించారు. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను ప్రదానం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌బాబు, పేరంట్స్ కమిటీ చైర్మన్ రస్నా, హెచ్‌ఎం కుసుమాంబ, ట్రాన్స్‌కో ఏఈ మహేందర్ రెడ్డి, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ డేలో విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. వీటిని ఎంఈఓ శ్రీరాములు పరిశీలించారు.



బైరెడ్డిపల్లి: సైన్స్ మేళాను పరిశీలిస్తున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప



రామకుప్పం: బహుమతుల పంపిణీ



కుప్పం: నమూనాల పరిశీలన



పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమిలో..



రొంపిచెర్ల బాలికల హైస్కూల్‌లో..

హౌసింగ్ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయండి



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: అధికారులు, నాయకులు సమన్వయంతో వారంలోగా పక్కా ఇళ్లు కావాల్సిన అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. హౌసింగ్, రెవెన్యూ శాఖల పనితీరుపై మంగళవారం మండల సచివాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఇళ్ల మంజూరుకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్ల జారీకి రెవెన్యూ శాఖ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రెవెన్యూ సిబ్బంది పనితీరు మారకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఓటీఎస్ కింద నగదు చెల్లించిన వారిలో ఇంకా 28 మందికి పట్టాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. మంజూరైన ఇళ్లను పూర్తి చేయడంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చొరవ చూపాలన్నారు. హౌసింగ్ డీఈ గురురాజారావు, తహసీల్దార్ లోకేశ్వరరావు, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దన్న, చంగప్ప, జెడ్పీటీసీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ పట్టాభి, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, మునిరత్నం పాల్గొన్నారు.

దర్జీలకు అండగా వైఎస్సార్‌సీపీ

రామకుప్పం: దర్జీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం రామకుప్పంలో రాయలసీమ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్‌ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భరత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం దర్జీలకు చేదోడు కింద ఏటా రూ.10 వేలు అందిస్తోందని తెలిపారు. టైలర్‌లకు ఐడీ కార్డులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, టైలర్లు రఫీ, మహమ్మద్, బాబురెడ్డి, కుప్పుస్వామి నాయక్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సేవలో ఎమ్మెల్సీ

పెద్దగెరిగపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ భరత్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నిర్మించి 21 ఏళ్లు పూర్తికావడంతో నాటకాలు, హరికథ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ వాణి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్ప గౌడు, ఏఎంసీ డైరెక్టర్ హేమాచలపతి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

రొంపిచెర్ల: మద్యం ఎమ్మార్పీకే విక్రయించాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. మంగళవారం రొంపిచెర్లలో మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. మద్యం దుకాణంలో అమ్మకాలు, నిల్వలలో ఎలాంటి తేడా ఉండరాదన్నారు. మద్యం అమ్మకాలపై రహస్యంగా విచారణ చేశామని, ఎక్కడా మద్యం అధిక ధరలకు విక్రయించడం లేదని అన్నారు.

దళిత నేతల నిరసన

పుంగనూరు: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత నాయ కులు మంగళవారం నిరసన తెలిపారు. మాలమహానాడు అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ మంగళం గ్రామంలో దళిత యువకుడు శ్రీనాథ్ మృతికి కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత నేతలు శ్రీనివాసులు, రెడ్డెప్ప, భాస్కర్, శ్రీనాథ్, మంజునాథ్, ఈశ్వర్, అమరావతమ్మ, అరుణమ్మ, గంగులమ్మ, శివకుమారి, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో వ్యవసాయ పరికరాలు

బైరెడ్డిపల్లి: రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ అధికారి మునిక్రిష్ణ అన్నారు. లక్కనపల్లెలో మంగళవారం మల్బరీ పంటలను పరిశీలించారు. ఆర్బీకేల్లో వ్యవసాయ పనిముట్లు రాయితీతో అందుబాటులో ఉన్నాయన్నారు. సేంద్రీయ ఎరువుల వల్ల పంట దిగుబడితో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు.

మదర్‌థెరిసా విద్యార్థుల ప్రతిభ

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ నాల్గో సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిసా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. బీఎస్సీలో సుష్మిత (9.49), సంధ్య(9.38), శ్రావణి (9.35), దీపిక(9.33), పూజిత(9.29), మోహన్‌రెడ్డి(9.27), బీకాంలో దీప్తి(8.91), భాస్కర్(8.82), యశ్వంత్‌బాలాజి (8.66), కావ్యశ్రీ(8.66) జీపీఏ సాధించినట్లు తెలిపారు. బీఎస్సీ, బీకాంలో 150 డిస్టింక్షన్లు, 130 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, ఏడీ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు అభినందించారు.

వందశాతం పోలింగ్ లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సదుం: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదు లక్ష్యం కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎల్‌ఆర్ భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు, టీచర్లు ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజాప్రతి నిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు కృషి చేయాలని సూచించారు. నియోజ కవర్గంలోనే మండలంలో అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలన్నారు. ఈనెల 3 నుంచి ప్రచారం ప్రారంభించాలని తెలిపారు. ఎంపీపీ ఎల్లప్ప, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుట్రాజు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించండి



పెద్ద ఉప్పరపల్లెలో ప్రచారంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సోమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు కోరారు. మంగళవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం ఆధ్వర్యంలో పెద్ద ఉప్పరపల్లె, ఎస్ నడింపల్లె పంచాయతీల్లో పట్టభద్రులను కలిసి శ్యాంప్రసాద్ రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీ గెలిపించాలని అభ్యర్థించారు. సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు, జిల్లా పార్టీ కార్యదర్శి శీలం భాస్కర్, మహిళా ప్రధాన కార్యదర్శి సరస్వతమ్మ, పార్టీ మండల మైనారిటీ అధ్యక్షుడు మస్తాన్ వలీ, వైస్ ఎంపీపీ ప్రభాకర, ఎంపీటీసీ సభ్యురాలు సర్వేశ్వరమ్మ, సర్పంచ్ వెంకటరమణ, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఒకే ధరతో ఇళ్ల నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

పుంగనూరు: పట్టణంలో తక్కువ ధరలతో నాణ్యమైన భవనాలు నిర్మించేలా భవన కార్మికులందరు ఏకమై నిర్ణయించినట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడు కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం సంఘం సమావేశాన్ని నిర్వహించారు. కేశవరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుతం 130 మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు భవన కార్మికులందరు ఇష్టానుసారం ధరలు లేకుండ ఒకే ధరతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కమిటీలో పెయింటర్లు, ఎలక్ట్రికల్‌వర్క్, హార్డ్‌వేర్ ఇలా అన్ని విభాగాలకు చెందిన వారిని సభ్యులుగా నియమిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటోందని కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు మోహన్, భాస్కర్ , సదా, చంద్ర, రమణ, సుధీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

పెద్దపంజాణి: జగనన్న భూరక్ష, భూహక్కు పథకం కింద భూముల రీసర్వేను పక్కాగా చేపడుతున్నట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. మంగళవారం శంకర్రాయలపేట గ్రామం ట్రిజంక్షన్ వద్ద సర్వే రాళ్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో ఇప్పటి వరకు 7 గ్రామాల్లోని రైతుల భూములకు రీసర్వే చేసి పట్టాలు పంపిణీ చేశామన్నారు.

ఏరియా ఆస్పత్రికి వీల్‌చైర్ల విరాళం

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి రూ.20 వేలు విలువజేసే రెండు వీల్‌చైర్లను జైభారత్ టైలర్ల సంఘం అందించింది. ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, ఆస్పత్రి సూపరిండెంటెంట్ హరగోపాల్ టైలర్లను అభినందించారు. సంఘం నాయకులు కుమార్, గౌస్, సూరి పాల్గొన్నారు.

పుంగనూరులో టైలర్ల దినోత్సవం



బైకు ర్యాలీలో టైలర్ల సంఘం నాయకులు

పుంగనూరు : పట్టణంలో మంగళవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మోటారు బైకుల ర్యాలీ నిర్వహించారు. టైలర్ల సంఘ నాయకులు ఖాసీమ్, సురేంద్ర, అస్లాంల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. సంఘ నాయకుడు ఖాసిమ్ మాట్లాడుతూ టైలర్లకు ప్రత్యేకంగా కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని, ఇళ్ల స్థలాలతో పాటు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం పంపనున్నట్లు తెలిపారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

చౌడేపల్లి: రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను , ప్రజాప్రతినిధులను ఎంపీపీ రామమూర్తి సూచించారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు, ఇంటిటికీ కొళాయి ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి శుద్ధి జలాల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలను ఉగాదినాటికి పూర్తి చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్ భరత్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ సుధాకర్, డీఈఈ ప్రసాద్, ఎంఈఓ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీసెల్ అధ్యక్షుడికి సన్మానం



వెంకటస్వామిని సన్మానిస్తున్న పెద్దిరెడ్డి, నాయకులు

సదుం: వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవలే నియమితులైన వెంకటస్వామి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు మంగళవారం సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శివారెడ్డి, హనుమంతరెడ్డి, రమేష్‌రెడ్డి, ఇమ్రాన్, ఇందాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ ఇంట్లో వెండి చోరీ

రామకుప్పం: మండలంలోని చెల్దిగానిపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ ఇంట్లో చోరీ జరిగినట్లు రామకుప్పం ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ నాగరాజుశాస్త్రి బెంగళూరులో నివాసం ఉంటున్నారు. చెల్దిగానిపల్లిలోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం అర్ధరాత్రి 200 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆవులపల్లె బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సోమల : విశేష అలంకరణలో స్వామివారు



పుంగనూరు: స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

సోమల : మండలంలోని ఆవులపల్లెలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో శ్రీస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

వైభవంగా ధ్వజారోహణం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసి ఉన్న శ్రీకళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారం భమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

శ్రీమలాలమ్మ ఆలయ వార్షికోత్సవం

గంగవరం: మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన శ్రీమలాలమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, గంగపూజ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మేదర కులస్తుల ఆరాధ్య దేవత మలాలమ్మ ఆలయ నిర్మాణం జరిగి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆలయ ధర్మకర్త చంద్రప్ప తెలిపారు.

ముత్యాల అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాటగంగమ్మ మంగళవారం ముత్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

మహిళా సాధికారతే క్రాంతి పథకం లక్ష్యం

పెద్దపంజాణి: మహిళా సాధికారతే వైఎస్సార్ క్రాంతి పథకం లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సున్నావడ్డీ, బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, స్త్రీనిధి, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, హౌసింగ్ లోన్‌లను గ్రూపు సభ్యులకు అందజేసి ఆర్థికంగా చేయూత అందిస్తున్నామని తెలిపారు. మండల సమైఖ్య అధ్యక్షురాలు మంజుల, ఏపీఎం క్రిష్ణప్ప, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌడేపల్లె: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి పొందే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజరు శేషగిరిరావు సూచించారు. మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఇండియన్ బ్యాంక్ రూడ్ సెటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ సేవలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల మండలాలకు చెందిన సంఘమిత్రలు(వీఓఏలు) పాల్గొన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు, ఆర్థిక అంశాలపై తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.